తెలుగు దినపత్రిక
# సిద్ధిపేట పవర్
ప్రతిక్షణం ప్రజల పక్షం

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న
సంచలన సమాచార దినపత్రిక 'సిద్ధిపేట పవర్' తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్ లు ఆర్సి ఇంచార్జ్ లు కావలెను
ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించండి
ఫోన్ : 9866338848
www.siddipetpower.com

శుక్రవారం | 28-02-2025 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు | సంపుటి 01 | సంచిక 41 | వెల : 06 రూ

## ఎస్ఎల్బీసీ సొరంగం వద్దకు

### వెళ్లకుండా హరీశ్ రావును అడ్డుకున్న పోలీసులు

- సహాయక కార్యక్రమాలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లే ప్రయత్నం
- చెక్ పోస్టు వద్ద అడ్డుకున్న పోలీసులు
- పోలీసుల తీరును నిరసిస్తూ బైఠాయించిన హరీశ్ రావు




బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావును ఎస్ఎల్బీసీ సొరంగం వద్దకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సొరంగంలో చిక్కుకుపోయిన 8 మందిని కాపాడేందుకు నాలుగు రోజులుగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సహాయక చర్యలు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లేందుకు హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు.దీంతో హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలు పోలీసుల చర్యను నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

## ముగిసిన మహా కుంభమేళా, ప్రధానమంత్రి

- పూజల్లో లోపం ఉంటే క్షమించాలని గంగామాతను ప్రార్థించిన మోదీ
- ఏర్పాట్ల విషయంలో లోపాలుంటే క్షమించాలంటూ భక్తులకు విజ్ఞప్తి
- భారతీయుల ఐక్యతకు కుంభమేళా నిదర్శనంగా నిలిచిందన్న ప్రధాని
- యూపీ ప్రభుత్వం, ప్రజలు ఆధ్యాత్మిక వేడుకను విజయవంతం చేశారన్న ప్రధాని






మహా కుంభమేళా సందర్భంగా పూజల్లో ఏదైనా లోపం ఉంటే గంగా, యమునా, సరస్వతి మాతలు క్షమించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రార్థించారు. అలాగే, ఏర్పాట్ల విషయంలో లోపాలున్నా, భక్తులెవరైనా అసౌకర్యానికి గురైనా మన్నించాలని కోరారు. మహా శివరాత్రి పండుగ రోజున కుంభమేళా ముగిసింది. 45 రోజుల పాటు జరిగిన ఈ ప్రపంచ అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకలో 66 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కుంభమేళా ముగిసిన నేపథ్యంలో నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు.భారతీయుల ఐక్యతకు ఈ కుంభమేళా నిదర్శనంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల నుండి కూడా భక్తులు తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించారని తెలిపారు. ఇంతటి పెద్ద కార్యక్రమాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా ముగించడం సులువైన విషయం కాదని ఆయన అన్నారు.అన్ని సవాళ్లను అధిగమించి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిందని ప్రశంసించారు. ఈ ప్రపంచ అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి, ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు.

## ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం




సిద్ధిపేట పవర్ దినపత్రిక: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ టన్నెల్ వద్ద రెస్క్యూ ఆపరేషన్ పనులను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకం కలగవద్దనే ఇక్కడికి రాలేదని ఆయన ఎర్కొన్నారు. ఘటన జరిగిన 6 రోజుల తర్వాత కూడా ప్రమాదంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంపై హరీష్ రావు మండిపడ్డారు. నేడు తమను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, బాధిత కుటుంబాలను దాచిపెట్టరని అన్నారు. రెస్క్యూ బృందాలకు, ప్రభుత్వ బృందాలకు మధ్య సమన్వయం లేదని వెల్లడించారు. మంత్రులు రోజూ హెలికాప్టర్లో వస్తున్నారు పోతున్నారని, అదేమన్నా టూరిస్ట్ స్పాట్ అనుకున్నారా అని హరీష్ రావు మండిపడ్డారు. ఇప్పటికీ కన్వేయర్ బెల్ట్ పని చేయడం లేదని, ప్రమాదం జరిగిన ఇన్నిరోజుల తర్వాత తట్టెడు మట్టి మాత్రమే బయటకు తెచ్చారని.. హడావుడి చేయడం తప్ప ఏమీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టన్నెల్ లో చిక్కుకున్న 8 మంది ప్రాణాలపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా శిథిలాల తొలగింపు పనుల్లో వేగం పెంచాలని, నిపుణుల సలహాలు తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా సీఎం రేవంత్ రెడ్డి కి ఇక్కడికి వచ్చేందుకు టైమ్ దొరకడం లేదు, కాని ఎన్నికల ప్రచారానికి, ఢిల్లీ టూర్లకు మాత్రం ఆయనకు టైం దొరుకుతుందని అన్నారు. కాంగ్రెస్ 14 నెలల పాలనలో 4 ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని, మరోవైపు కృష్ణా జలాలు ఏపీ తరలించుకు పోతుంటే కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడాఆ నోరు మెదపడం లేదు ఎందుకని హరీష్ రావు నిలదీశారు.

## సీఎం తో ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రతినిధులు భేటీ..

దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ ప్రతినిధులు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. తెలంగాణలోని వివిధ ప్రాజెక్టులపై దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించాలని ఎమ్మార్ ప్రాపర్టీస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.



2001లో ఉమ్మడి రాష్ట్రంలో దుబాయికు చెందిన ఎమ్మార్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో కన్వెన్షన్ సెంటర్, హోటల్, గోల్ఫ్ కోర్సు, విల్లాలు తదితర ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు అప్పటి ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుందని. ఏపీఐఐసీతో ఆ సంస్థ చేసుకున్న ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని అప్పట్లో సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఏజెన్సీల దర్యాప్తులు, కోర్టుల్లో విచారణలు కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2015 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మార్ ప్రాపర్టీస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల వివాదాల పరిష్కారానికి ఛీఫ్ సెక్రెటరీ సారధ్యంలో అయిదుగురు సెక్రెటరీల కమిటీని ఏర్పాటు చేసిందని వివరించారు. మరోవైపు, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత సొలిసిటర్ జనరల్ కూడా ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు.

## నూతన సాంకేతిక పరిజ్ఞానాలు రెండు వైపులా పదునున్న కత్తిలాంటివి : కేటీఆర్



బెంగళూరు : నూతన సాంకేతిక పరిజ్ఞానాలు రెండు వైపులా పదునున్న కత్తిలాంటివి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకోకుంటే భారీ విధ్వంసం జరిగే అవకాశం ఉంటుందన్నారు. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయానికి వాడుకోవచ్చు, యుద్ధానికి వాడుకోవచ్చు నిర్ణయించుకోవాల్సింది మనమే అని పేర్కొన్నారు. అందరికీ సాంకేతిక అక్షరాస్యత (డిజిటల్ లిటరసీ) లేకుంటే అందరికీ సమాన అవకాశాలు అందించలేమని తెలిపారు. దేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ జూదం ఘోరాలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. కేవలం కాలర్ ట్యూన్ పెట్టి వీటిని అరికట్టలేం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# హోరాహోరీగా తెలంగాణలో ఎన్నిక..
# కాంగ్రెస్, బీజేపీకి షాక్ తప్పదా

తెలంగాణలో మూడు స్థానాలకు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు గతంలో ఎన్నడూలేని విధంగా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయపార్టీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ఎన్నికలపై ప్రభావం చూపిస్తుండటంతో గెలుపు ఎవరిదనేది ఉత్కంఠ రేపుతోంది. రెండు టీచర్స్ ఎమ్మెల్సీ, ఒక గ్రాడ్యుయేట్ స్థానానికి ఎన్నిక జరుగుతుండగా అందరి దృష్టి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల స్థానంపై నెలకొంది. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు బీఎస్పీ మద్దతుతో బరిలో ఉన్న అభ్యర్థి మధ్యనే ప్రధానపోటీ నెలకొంది. ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ మద్దతుతో పోటీలో ఉన్న మరో అభ్యర్థి కూడా వివిధ పార్టీల అభ్యర్థులతో సమానంగా పోటీపడుతున్నారట. తెలంగాణలో అధికార కాంగ్రెస్ ఈ ఎన్నికను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అదే సమయంలో బీజేపీ సైతం గెలుపే లక్ష్యంగా పనిచేసింది. ఆ పార్టీకి చెందిన నలుగు ఎంపీలు బీజేపీ అభ్యర్థి కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ తరపున ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో అర్థం చేసుకోవచ్చు. విద్యావంతులైన పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్న నేపథ్యంలో గెలుపు ఎవరిదనేది తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. రాజకీయ పార్టీల తరపున అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ఓటర్లు తమకు ఇష్టమైన అభ్యర్థికి ఓటు వేసుకునే అవకాశం ఉంటుంది. మొదటిసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ వాదాన్ని గట్టిగా వినిపిస్తుండటంతో ఓటర్లు ఎలాంటి తీర్పునిస్తారనేది ఆసక్తిగా మారింది.

**ఒకచోట కాంగ్రెస్, మూడు చోట్ల బీజేపీ**

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించి పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ రెండుచోట్ల బీజేపీ అభ్యర్థులు పోటీచేస్తుండగా.. కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో మాత్రమే పోటీచేస్తోంది. ఇక నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి పోటీలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థిని పెట్టలేదు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయసంఘాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాజకీయ ప్రాధాన్యతకంటే యూనియన్ల ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఈ రెండుచోట్ల ఎవరు గెలుస్తారనే విషయానికి అంతగా ప్రాధాన్యత లేకుండా పోయింది. ఉపాధ్యాయసంఘాల నేతల్లో చీలిక రావడంతో ఎవరు ఎవరికి మద్దతు ఇస్తున్నారనే విషయంలో స్పష్టత లేకుండా పోయింది. ఇక ఎక్కువమంది ఓటర్లు ఉన్న పట్టభద్రుల స్థానంలో మాత్రం చతుర్ముఖ పోటీ నెలకొంది. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ ఉందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ.. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ వైపు ఎక్కువ యువత ఆసక్తి చూపిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

**50 మందికి పైగా..**

పోటీలో 56మందికి అభ్యర్థులు ఉన్నప్పటికీ.. నలుగురు అభ్యర్థుల మధ్య ప్రధానపోటీ నెలకొంది. ఈ నలుగురు అభ్యర్థుల్లో ముగ్గురు విద్యారంగానికి సంబంధించిన వ్యక్తులు కాగా.. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి ప్రత్యక్షంగా విద్యారంగంతో సంబంధం లేదు. పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం స్టడీ మెటీరియల్ తయారీలో నైపుణ్యం ఉన్న ప్రసన్న హరికృష్ణకు గ్రాడ్యుయేట్లలో మంచి పేరుందనే చర్చ జరుగుతోంది. దీంతో రెండు లేదా మూడో ప్రాధాన్యత ఓటుతో అయినా ప్రసన్న హరికృష్ణ గెలుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. వాస్తవానికి కాంగ్రెస్ టికెట్ కోసం ప్రసన్న హరికృష్ణ చివరి వరకు ప్రయత్నించారు. కాంగ్రెస్ అధిష్టానం నరేందర్ రెడ్డి వైపు మొగ్గుచూపడంతో ఆయన బీఎస్పీ నుంచి పోటీలో ఉన్నారు. వాస్తవానికి ఎమ్మెల్సీగా పోటీచేయాలనే ఉద్దేశంతో ఏడాది నుంచే ప్రసన్న హరికృష్ణ నాలుగు జిల్లాల్లో గ్రాడ్యుయేట్లను కలవడం ద్వారా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. దీంతో ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆయన నేరుగా కలిసి ఓట్లను అభ్యర్థించారు.




నలుగురు అభ్యర్థులతో పోలిస్తే ప్రసన్న హరికృష్ణ పేరు పట్టభద్రుల్లో గట్టిగా వినిపిస్తోందనే చర్చ జరుగుతోంది. అదే సమయంలో పార్టీ బలం అంజిరెడ్డి, నరేందర్ రెడ్డికి ప్లస్‌గా భావిస్తున్నారు. ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ మద్దతుతో పోటీలో ఉన్న శేఖర్ రావు సైతం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీంతో గెలుపుపై నలుగురు అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు.

**ఫలితం కోసం..**

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానం నుంచి ఎవరు గెలిచినా మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిచే అవకాశం లేదనేది సుస్పష్టం. నలుగురు అభ్యర్థుల మధ్య ప్రధానపోటీ నెలకొని ఉండటంతో మూడు లేదా నాలుగో ప్రాధాన్యత ఓటుతో మాత్రమే ఫలితం తేలే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రధాన పార్టీల అభ్యర్థులైన అంజిరెడ్డి, నరేందర్ రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన ఓటర్లు కచ్చితంగా రెండు లేదా మూడో ప్రాధాన్యత ఓటును ప్రసన్న హరికృష్ణకు వేసే అవకాశం ఉంటుంది. ప్రసన్న హరికృష్ణ గతంలో కాంగ్రెస్ సానుభూతిపరుడిగా ఉండటంతో కాంగ్రెస్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసిన ఓటర్లు రెండో ప్రాధాన్యత ఓటును ప్రసన్న హరికృష్ణకు వేసే అవకాశం ఉంది. అదే సమయంలో అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన ఓటర్లు రెండో ప్రాధాన్యత ఓటును కాంగ్రెస్ కంటే ప్రసన్న హరికృష్ణకు వేయడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన అభ్యర్థులు రెండో ప్రధాన్యత ఓటును కచ్చితంగా నరేందర్ రెడ్డికి వేస్తారని చెప్పలేని పరిస్థితి. ఆ ఓటర్లు రెండుగా చీలి నరేందర్ రెడ్డి, అంజిరెడ్డికి వేసే అవకాశం ఉంది. దీంతో రెండు లేదా మూడో ప్రాధాన్యత ఓటుతో గెలుస్తాననే విశ్వాసాన్ని ప్రసన్న హరికృష్ణ వ్యక్తం చేస్తున్నారు. శేఖర్ రావు సైతం మొదటి ప్రాధాన్యత ఓట్లను అధికంగా పొందే అవకాశం ఉంటుంది. శేఖర్‌రావుకు ఓటు వేసిన ఓటర్లలో ఎక్కువమంది రెండో ప్రాధాన్యత ఓటును ప్రసన్న హరికృష్ణకు వేసే అవకాశం లేకపోలేదు. దీంతో తొలి ప్రాధాన్యత ఓట్లను ఎక్కువగా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు సాధించినప్పటికీ రెండో ప్రాధాన్యత ఓటుతో ప్రసన్న హరికృష్ణ ప్రధాన పార్టీ అభ్యర్థులకు షాక్ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇవాళ పోలింగ్ జరుగుతుండగా.. మార్చి3న ఓట్ల లెక్కింపు చేపట్టి.. ఫలితం వెల్లడిస్తారు..

# ఓటు మన హక్కు
## ఓటు వేయడం మన బాధ్యత



సిద్దిపేట పవర్ దినపత్రిక ఫిబ్రవరి 27: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ నం. 471 లో యువ నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ - ఆదిలాబాద్ - నిజామాబాద్ - మెదక్ పట్టభద్రుల ఓటుహక్కునువినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైనవి కాగా, సమర్థమైన నాయకత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరై ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి ఆయన సూచించారు. మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్ రెడ్డి, టిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు గోవిందరం రవి, ప్రధాన కార్యదర్శి సంపత్ యాదవ్, సాయి రెడ్డి, సంతోష్, వేణు, నరేష్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధం..
# మహిళ హత్య



సిద్ధిపేట జిల్లాలో అదృశ్యమైన మహిళ హత్యకు గురైంది. వర్గల్ అనంతగిరిపల్లికి చెందిన యాదమ్మ(40) భర్త చనిపోయాడు. అదే గ్రామానికి చెందిన చిన్న లక్ష్మయ్యతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలోనే పెళ్లి చేసుకోవాలని ఇబ్బంది పెట్టడంతో ఈనెల 15న కోమటిబండ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి కల్లులో పురుగు మందు కలిపి తాగించాడు. అనంతరం చీరతో ఉరేసి చంపాడు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# ఆటంకాలున్నా శరవేగంగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

- అడుగడుగునా ఎన్నో అవంతరాలు
- అయినా ఆగకుండా సాగుతున్న ఆపరేషన్
- జియాలజీ నిపుణుల సూచనలతో డీ వాటరింగ్ ప్రక్రియ
- లోకో ట్రైన్‌లో ఐదు టబ్బుల బురద బయటకు
- నిమిషానికి ఐదు లీటర్ల మేర నీటి ఊట
- యంత్రాలతో తోడేస్తున్న సిబ్బంది
- టీబీఎం కటింగ్ కోసం సౌత్ సెంట్రల్ రైల్వే బృందం
- సొరంగంలో 57 మంది నిపుణుల సహాయక చర్యలు
- నిరంతరంగా సాగుతున్న సహాయక ప్రక్రియ
- లోపలకు ఆహారం, నీరు పంపుతున్న అధికారులు

శ్రీశైలం ఎడమ బ్రాంచ్ కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో రెస్క్యూ టీమ్ సభ్యులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ కోసం పది ఏజెన్సీల రెస్క్యూ బృందాలు ఆరు రోజులుగా సహాయక చర్యలు చేపట్టిన విషయం తెలిసింది. ఆరోరోజుకు చేరిన వారి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యుల్లో మరింత ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదం జరిగి ఆరు రోజులు గడుస్తుండటంతో కార్మికులు ప్రాణాలతో ఉన్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సహాయక చర్యలకు ప్రధాన ఆటంకంగా ఉన్నా మూడు అవంతరాలను అధిగమించడానికి బుధవారం ప్రణాళిక చేశారు. ఈ ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నారు. మరో 36 గంటల్లో కార్మికుల ఆచూకీ గుర్తించడం చేపట్టిన ఆపరేషన్ కూడా సత్ఫలితాలు ఇస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రమాదం జరిగే ప్రదేశానికి రెస్క్యూ టీమ్ చేరినట్లు సమాచారం.

**జియాలజీ నిపుణుల సూచనతో**

టన్నెల్ లోని ప్రమాద ప్రదేశంలో 15 ఫీట్ల ఎత్తు 200 మీటర్ల మేర బురద పేరుకుపోయిందని, ఇదే సహాయక కార్యక్రమాలకు అవంతరాలని, అలాగే సహాయక చర్యలు ముందుకు సాగకపోవడానికి ఇదే కారణమని రెస్క్యూ సిబ్బంది గుర్తించారు. టన్నెల్ లో ఉన్న నీటిని భారీ పంపులతో బయటికి పంపడం, బురదను తొలగించడం, ద్వారా డీబీఎం ముందుభాగం చెరుకోనున్నట్లు ప్రణాళిక చేశారు. ఈ ప్రణాళిక మేరకు జియాలజీ నిపుణులను రప్పించి వారి సూచనలతో బురద, నీటి ని తొలగిస్తున్నారు. ఉదయం జియాలజీ నిపుణులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా, సింగరేణి, జేపీ కంపెనీకి చెందిన 57 మంది బృందం లోకో రైలులో లోపలకు వెళ్లారు. అయితే అందులో ఐదు పెద్దపెద్ద బకెట్లతో బురదను లోకో ట్రైన్‌లో బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

**టీబీఎం కటింగ్ కోసం సౌత్ సెంటర్ రైల్వే సాయం**

టీబీఎం కటింగ్ కోసం సౌత్ సెంటర్ రైల్వేలో పనిచేస్తున్న నిపుణుల సాయం తీసుకున్నారు. సికింద్రాబాద్ నుంచి ఐదుగురు బృందం సభ్యులు ఇక్కడకు చేరుకున్నారు. వారితో పాటు సామాగ్రిని కూడా లోకో ట్రైన్‌లో లోపలకు పంపించారు. ఇప్పటి వరకు ఉన్న పది ఏజెన్సీలతోపాటు సహాయక చర్యల్లో రైల్వే శాఖ నిపుణులు కూడా పాల్గొన్నారు.

**లోకో ట్రైన్‌లో ఆహారం**

రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న 57 మంది నిపుణులకు ఆహారం, తాగునీరు, ఇతర ఆహార పదార్థాలు లోకో ట్రైన్‌లో లోపలకు పంపించారు. ఇంకా వారికి అవసరమైన మెటీరియల్స్ లోపలకు పంపిస్తున్నారు. లోపల నుంచి వచ్చిన బురద బకెట్ల ఖాళీ చేసి అదే ట్రైన్‌లో పంపించారు. నిరంతరం ఆపరేషన్ చేయడానికి అవసరమైన వాటిని లోపలకు అందిస్తున్నారు. అలాగే నిరంతరం ఆక్సిజన్ ఉండేలా ఏర్పాటు చేశారు. బయట ఉన్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, విపత్తుల నిర్వాహణ ఛీఫ్ సెక్రటరీ అరవింద్, ఇరిగేషన్ సెక్రటరీ శివరాజ్ పాటిల్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

**వారి ప్రాణాలపై ఆశలు వదులుకున్నట్లేనా?**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి ఆరు రోజులు అయింది. మంగళవారం, బుధవారం రెండు సార్లు రెస్క్యూ కోసం టన్నెల్ చివరి వరకు వెళ్లిన సిబ్బంది.. మాటల ప్రకారం.. టన్నెల్ లో ప్రమాదం జరిగిన చోట.. భారీగా బురద, మట్టి దిబ్బలు తప్ప ఏమీ కనిపించలేదని.. అన్నారు. అక్కడ భయానక పరిస్థితులు ఉన్నాయని, అందుకే సహాయక చర్యలు కూడా ముందుకు వెళ్లలేకపోయామని చెబుతున్న మాటలు ప్రకారం వారి ప్రాణాలపై ఆశలు వదులుకున్నట్లే అని సంకేతాలు ఇచ్చినట్లు అయింది. టీబీఎంలో ఆ ఎనిమిది మంది ప్రాణాలతో ఉన్నప్పుడు కటింగ్ చేస్తే వారి ప్రాణాలకు ముప్పు వస్తుందని మొదట రెస్క్యూ టీమ్ భావించారు. ఇప్పుడు కటింగ్‌కు సిద్ధపడ్డారంటే వారు ప్రాణాలతో లేరన్న నిర్ధారణకు వచ్చి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఆక్సిజన్ అందకపోవడంతో పలుమార్లు రెస్క్యూ టీమ్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే క్లిష్టపరిస్థితులలో వారు ప్రాణాలతో ఉండగలరా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.